క్లుప్తంగా

సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అడవిదేవులపల్లి: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఎంపీడీఓ రమేష్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉమ్మడి మండల కార్యదర్శి బైరం దయానంద్ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. వివిధ గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులకు వినతి పత్రాలు అందజేశారు. వారిలో జానమ్మ, ఉషారాణి, నాగేంద్రమ్మ, పద్మ తదితరులున్నారు.

న్యాయవాదుల శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : మంచిర్యాలలో ఈనెల 10, 11వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి న్యాయవాదుల శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మిర్యాలగూడ అధ్యక్షుడు పూసపాటి పరమేష్ కోరారు. గురువారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. శిక్షణ తరగతుల్లో నూతన చట్టాలతో పాటు రీడింగ్ అండ్ డ్రాఫ్ట్, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ ఆర్ట్ ఆఫ్ క్రాస్ ఎగ్జామినేషన్‌ను వివరించనున్నట్లు తెలిపారు. నకిరేకల్, దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి, సూర్యాపేట, నిడమనూరు కోర్టుల్లో పని చేస్తున్న న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కిశోర్‌కుమార్‌కు ఇంటర్నేషనల్ అవార్డు

నల్లగొండ టౌన్: పట్టణానికి చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ పల్లె కిశోర్‌కుమార్ జోష్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. కిశోర్‌కుమార్ తబలా వాయిద్యకారుడిగా, గాయకుడిగా జానపద కళాకారుడిగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో గురువారం జోష్ ఇంటర్నేషనల్ అవార్డును చైర్మన్ సంజూష్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు, జబర్దస్త్ కళాకారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నమ్మొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నమ్మొద్దని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్ పోలీసులతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఇరు మతాల మధ్య విద్వేషపూరిత వాతావరణం రెచ్చగొట్టే విధంగా, ఇతర మతాల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టకూడదని సూచించారు. సోషల్ మీడియాపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. అనవసర పోస్టులు పెట్టి కేసులపాలు కావొద్దని, మతాల మధ్య స్నేహపూరిత వాతావరణం ఉండేవిధంగా చూసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐలు శంకర్, సైదులు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు

డిండి: మండల పరిధిలోని వావిల్‌కోల్ నుంచి వడ్డెరగూడెం గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతుల నిమిత్తం కంకర పరిచారు. కానీ కొన్ని నెలలు కావస్తున్నా బీటీ వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కంకర పరిచిన రోడ్డు



నిరుపయోగంగా మరుగుదొడ్లు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లిలో ఐదేళ్ల క్రితం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక నిధుల ద్వారా మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. పంచాయతీ పాలకవర్గం ఉన్నంత వరకు బాగానే నిర్వహించినా ఆ తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వీటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు!

- లబ్ధిదారుల ఎంపికలో అర్హులను విస్మరించారని ఆరోపణ
- ఇళ్లు, భూములు ఉన్న వారినే ఎంపిక చేశారని ఫిర్యాదులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిమల్ల సైదులు, కలమ్మ. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉంది. వీరిది చింతపల్లి మండల కేంద్రం. గత 40 సంవత్సరాల నుంచి పూరి గుడిసెలోనే జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో జాబితాలో తమ పేరు కూడా వస్తుందని ఆశగా ఎదురుచూసినా నిరాశే దక్కింది. ఎలాంటి భూములు, వాహనాలు లేవని, అయినా అర్హుల జాబితాలో పేరు రాలేదని వాపోతున్నారు.

చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తూ అర్హులకు కాకుండా అనర్హులకు ఇస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. చింతపల్లి మండల పరిధిలోని 34 గ్రామపంచాయతీలు 70 ఆవాస గ్రామాలు ఉండగా ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు నిర్మించేందుకు మండల వ్యాప్తంగా సుమారుగా 450 ఇళ్లు మంజూరు చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామంలో ఉంటూ పూరి గుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్న వారిని లబ్ధిదారులుగా గుర్తించాలని నిబంధనలు ఉన్నాయి. కానీ నిబంధనలకు వ్యతిరేకంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇల్లు, భూమి, కార్లు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారిని కూడా అర్హులుగా ఎంపిక చేశారని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంతోపాటు వింజమూరు, కుర్మేడు, కురంపల్లి, వివిధ గ్రామాల్లోని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అర్హులైన వారు తమకు ఇల్లు కేటాయించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నష్టపోయిన నిజమైన లబ్ధిదారులు

ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన ఇళ్లల్లో అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించి అర్హులకు మొండి చేయి చూపారు. గ్రామంలో ఇల్లు లేని వారిని అధికారులు గుర్తించలేకపోయారు. దీంతో నిజమైన లబ్ధిదారులు నష్టపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జాబితా నుంచి అనర్హులను తొలగించి అర్హులను గుర్తించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నాకు ఇల్లు మంజూరు చేయాలి



చింతపల్లి మండల కేంద్రంలో గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్నాను. 70 సంవత్సరాల నుంచి ఈ గుడిసెలోనే మా నాన్న కూడా ఉండేవాడు. ప్రస్తుతం నేను కూడా ఈ గుడిసెలోనే ఉంటున్నాను. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో నా పేరు రాలేదు. ఇళ్లు, భూములు ఉన్నవారికే మళ్లీ ఇల్లు మంజూరు చేశారు. అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలి.

– కర్నాటి నిరంజన్, చింతపల్లి

అర్హులను గుర్తించాం

చింతపల్లి మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను జిల్లా అధికారులకు పంపించాం. గ్రామాల్లో ఇప్పటికే పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాం. ఈ జాబితాను జిల్లా అధికారులకు పంపించాం. ఎక్కడ కూడా అవకతవకలకు అవకాశం లేకుండా జాబితాను రూపొందించాం.

– సుజాత, ఎంపీడీఓ, చింతపల్లి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎస్‌ఐ సతీష్‌రెడ్డి

హాలియా : విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, వ్యవసాయాధికారి సరిత హెచ్చరించారు. గురువారం అనుముల మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో విత్తన డీలర్లు, ఏఈఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రతి రైతుకు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు విక్రయించాలని ప్రతి కొనుగోలు, విక్రయం వివరాలను డీలర్ల వద్ద ఉన్న రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్, ధరలు, నిల్వ పట్టి దుకాణాల్లో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి



మాట్లాడుతున్న ఏపీఎం చంద్రశేఖర్

మాడ్గులపల్లి: యాసంగి సీజన్‌లో డీఆర్‌డీఏ సెర్ప్ ద్వారా మాడ్గులపల్లి మండలంలోని గారకుంటపాలెం, గుర్రప్పగూడెం, ఆగామోత్కూర్, చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లోని కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు ఏపీఎం బాషపాక చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పాములపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు గ్రామాల్లో 1098 మంది రైతుల నుంచి ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2320 చొప్పున రూ.16,13,15,168 విలువ గల 69,532.40 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. 865 మంది రైతులకు రూ.13,02,80,992 బిల్లులు సబ్మిట్ చేశామన్నారు. సమావేశంలో పావని, మణెమ్మ, సీసీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్న దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ

దేవరకొండ: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. దేవరకొండలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కరాటే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడాకారులకు అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్‌గౌడ్, సురేష్, రాపోలు నిరంజన్, అన్వర్, నవీన్, రమేష్, ఏడుకొండలు, సుజిత్, విశ్వనాథ్ తదితరులున్నారు.

పదేళ్లు కావొస్తున్నా పూర్తికాలే..



సీసీ చేపట్టాల్సిన నిడమనూరు చెరువు కట్ట

- అసంపూర్తిగా మినీట్యాంక్‌బండ్ పనులు
- గుంతలమయంగా మారిన చెరువు కట్ట



నిడమనూరు చెరువు అలుగు

నిడమనూరు: నిడమనూరు చెరువు పునర్నిర్మాణ పనులు, మినీ ట్యాంక్ పనులు చేపట్టి పదేళ్లయినా అసంపూర్తిగానే ఉన్నాయి. 2016లో వచ్చిన వరదల్లో చెరువు కట్ట తెగిపోవడంతో చెరువును మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.6.2 కోట్లతో మినీ ట్యాంకుబండ్‌గా మార్చేందుకు పనులు చేపట్టారు. అయితే పదేళ్లు కావొస్తున్నా పనులు పూర్తికాలేదు. కట్ట బలోపేతం, అలుగు నిర్మాణం, బతుకమ్మ ఘాట్ పనులు పూర్తికాగా, చెరువు కట్టపై ఇరువైపులా రెయిలింగ్, ప్లాట్ ఫాం పనులు, తూముకు ఇరువైపులా, అలుగు చివరల పలు చోట్ల సీసీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గతంలో గుంటకగూడెం, ముప్పారం, సోమవారిగూడెం వాసులు ఈ చెరువు కట్టపై రాకపోకలు సాగించేవారు. పనులు పూర్తికాకపోవడంతో నర్సింహులగూడెం నుంచి ముప్పారం రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వేసవిలో చెరువులో నీటి నిల్వ తగ్గినందున తూముల వద్ద, అలుగు చివరల సీసీ పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువు రహదారి గుంతలమయం

నిడమనూరు పోలీస్ స్టేషన్ రోడ్డు ఎదురుగా ఉన్న చెరువు రహదారిలో 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు రహదారి గుంతలమయంగా ఉండడంతోపాటు, చెరువు కింద తూము దగ్గర ముళ్ల పొదలు, కంపచెట్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో చెట్ల తొలగింపు పనులు చేపట్టి, ట్యాంకు బండ్ దిగువన పార్కు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.

పనులు పూర్తిచేయాలి

చెరవు కట్ట పనులు పూర్తి చేసి, రోడ్డు వేస్తే గుంటకగూడెం, ముప్పారం, సోమవారిగూడెం గ్రామాలకు నిడమనూరు మండల కేంద్రం నుంచి దూరం తగ్గుతుంది. ప్రస్తుతం నర్సింహులగూడెం నుంచి వెళ్తుండడంతో మూడు కిలోమీటర్ల దూరభారం అవుతోంది.

– చెర్క శ్రీను, సోమవారిగూడెం

సేదతీరేందుకు సౌకర్యంగా ఉంటుంది

నిడమనూరు చెరువు కట్టపై ప్రతినిత్యం, యువకులు, 40 సంవత్సరాలు పైబడిన వారందరు మార్నింగ్ వాక్ చేస్తుంటారు. పనులు పూర్తిచేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. సాయంత్రం, వేసవిలో చెరువు పరిసరాలు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. పలువురు సేద తీరేందుకు సౌకర్యంగా ఉంటుంది.

– పున్న శంకర్, నిడమనూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మాడ్గులపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోపుచర్ల గ్రామానికి చెందిన బొప్పని సుధాకర్ తన బైక్‌పై తోపుచర్ల నుంచి తిప్పర్తికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కక్కడం గ్రామ శివారులోకి రాగానే ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తున్న సకారి ఉత్తమ్ అనే వ్యక్తి సుధాకర్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో సుధాకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సుధాకర్ భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

జూదరుల అరెస్టు

డిండి: జూదం ఆడుతున్న ముగ్గురిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన చాదాసు చరణ్, వెల్దూర్ వెంకటేశ్వర్లు, రామ్లా వెంకటేష్, రామస్వామి, బోయని మల్లేష్‌లు గ్రామ శివారులో జూదం ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జూదం స్థావరంపై దాడి చేసి చరణ్, వెంకటేశ్వర్లు, వెంకటేష్‌లను పట్టుకోగా.. రామస్వామి, మల్లేష్ పరారయ్యారు. పట్టుబడ్డ వారినుంచి రూ.1020 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాడపల్లి శివాలయంలో హైకోర్టు జీపీ, ఏజీపీ పూజలు

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని వాడపల్లి శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి దేవాలయాన్ని గురువారం హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ మంగీలాల్‌నాయక్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ శైలజ, అవినాష్ కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తరుణ్‌శాస్త్రి వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ కార్యనిర్వహణాధికారి జ్యోతి ఉన్నారు.



పూజలు చేస్తున్న హైకోర్టు జీపీ, ఏజీపీలు

డీఎంహెచ్‌ఓ తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

పెద్దవూర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ఓపీలు, సిబ్బంది హాజరు పట్టిక, రోగుల వివరాలు, ఐపీ స్టోర్‌ను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసరవి, మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ ఉన్నారు.

జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక



తక్కెళ్లపల్లి ప్రణవి

తిరుమలగిరి(నాగార్జున సాగర్): మహారాష్ట్రలోని విదర్భలో ఈ నెల 9,10, 11 తేదీల్లో జరిగే జాతీయ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు తిరుమలగిరి మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన తక్కెళ్లపల్లి ప్రణవి ఎంపికైంది. గత నెల 28న ఖమ్మంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపరిచి తెలంగాణ తరుపున ఎంపికైంది. ఇందులో భాగంగా ఈ నెల 1వతేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొంది. ప్రణవి ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు పక్కనే ఆస్పత్రి వ్యర్థాలు

- దుర్వాసన వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



రెడ్డికాలనీలో రోడ్డు పక్కన పడేసిన ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన వ్యర్థాలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని 20వ వార్డు రెడ్డికాలనీలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి సంబంధించిన బయోవేస్ట్‌ను రోడ్డు పక్కనే పడేశారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఆస్పత్రి వ్యర్థాలతో దుర్వాసన వస్తుండడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఆస్పత్రి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లారీల కొరత.. రైతుల వెత

- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం
- రోజుల తరబడి రైతుల పడిగాపులు
- అకాల వర్షాలు వస్తుండడంతో ఆందోళన చెందుతున్న రైతులు



చిన్నఅడిశర్లపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ఎగుమతికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పెండ్లిపాకల పరిధిలోని బాబ్లా తండ వద్ద మరొక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ రెండు కొనుగోలు కేంద్రాలకు మండల పరిధిలోని పలుగ్రామాల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాలైన నాంపల్లి, గుర్రంపోడు మండలాల నుంచి కూడా రైతులు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. అయితే గత పది రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. లారీలు, హమాలీల కొరత ఉండడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ధాన్యాన్ని ఆరబెట్టి మ్యాచర్ వచ్చే వరకు కేంద్రాల్లోనే ఉంటూ ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు జాప్యంతో పెరుగుతున్న ఖర్చులు

ధాన్యం కొనుగోలు ఆలస్యం అవుతుండడంతో రైతులకు రోజురోజుకు ఖర్చులు పెరుగుతున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టడానికి, ధాన్యంపై కప్పడానికి కావాల్సిన టార్పాలిన్ల అద్దె పెరుగుతుందని, ఒక్కో రైతుకు దాదాపుగా రూ.5వేల ఖర్చు అదనంగా అవుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా హమాలీల ఖర్చు కూడా పెరుగుతుందని, ఇవన్నీ కలిపితే రైతుకు ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని పేర్కొంటున్నారు.

అకాల వర్షాలతో ఆందోళన

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సమయంలో పెద్దగా లారీల కొరత లేదు. ఏ రోజు మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని అదే రోజు తరలించేవారు. కానీ గత పది రోజుల నుంచి లారీల కొరత ఏర్పడడంతో మ్యాచర్ వచ్చిన ధాన్యం కూడా కేంద్రాల్లోనే ఉంటున్నాయి. దీనికి ప్రధాన కారణం లారీల కొరతతో పాటు బస్తాల కొరత కూడా ఉందని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. లారీల కొరత ఇలాగే ఉంటే తాము భారీగా నష్టపోయే ప్రమాదముందని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అకాల వర్షాలతో ధాన్యం తడిసే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని లారీల కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

లారీల యాజమాన్యంతో మాట్లాడుతాం

లారీల కొరతతో కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం పేరుకుపోయిన మాట వాస్తవమే. దీనికి సంబంధించి లారీల యాజమాన్యంతో మాట్లాడి త్వరగా కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– నరేందర్, తహసీల్దార్, కొండమల్లేపల్లి

10- 15 రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేస్తాం

కొండమల్లేపల్లి మండల పరిధిలో చిన్నఅడిశర్లపల్లి, పెండ్లిపాకల పరిధిలోని బాబ్లా తండ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 700 మంది రైతుల నుంచి సుమారు 1600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. లారీల కొరతతో కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయింది. ఈ సమస్యపై లారీల యాజమాన్యంతో మాట్లాడి వేగంగా లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటాం. మరో 10- 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం.

– జానకిరాములు, వ్యవసాయ అధికారి, కొండమల్లేపల్లి

ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ శీను నాయక్

నాగార్జునసాగర్ : ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి మతసామరస్యాన్ని చాటాలని సాగర్ సీఐ శీను నాయక్ కోరారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ మతాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఇండియా, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో ప్రజలు బూటకపు ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎవరైనా మతాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియా పోస్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరసనలు, ధర్నాలు, ఇతర కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో సాగర్ ఎస్‌ఐ సంపత్ తదితరులు పాల్గొన్నారు.